RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 13 సంచిక : 10 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | బుధవారం, 17 జూలై 2024 | పేజీలు : 4 | వెల : 2/-

# పాస్‌బుక్ ఆధారంగానే రైతు రుణమాఫీ

## పారదర్శకంగా ప్రజాహిత పాలనను అందించటమే మా లక్ష్యం - రేవంత్‌రెడ్డి




హైదరాబాద్: రుణమాఫీకి రేషన్‌కార్డు నిబంధనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. పాస్‌బుక్ ఆధారంగానే కుటుంబానికి రూ.2 లక్షల రుణమాఫీ ఇస్తామని స్పష్టం చేశారు. రైతు కుటుంబాన్ని గుర్తించేందుకే రేషన్‌కార్డు నిబంధన పెట్టామని తెలిపారు. పారదర్శకంగా ప్రజాహిత పాలనను అందించటమే తమ ప్రభుత్వం ఎంచుకున్న మొదటి ప్రాధాన్యమని సీఎం స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమతుల్యం చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని వివరించారు. ప్రభుత్వ ప్రాధా న్యతలతో పాటు ప్రజల ప్రయోజనాలను అర్థం చేసుకొని పని చేయాలని జిల్లా కలెక్టర్లకు సీఎం రేవంత్ దిశా నిర్దేశం చేశారు. సచి వాలయంలో మంగళవారం జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమం త్రి రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, కొండా సురేఖ, రాష్ట్ర ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సదస్సును ప్రారంభించగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభోప న్యాసం చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు అన్ని శాఖల కార్యదర్శులు, అన్ని జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

**సమర్థులైన యువ కలెక్టర్లను నియమించాం..** అనంతరం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత జిల్లా కలెక్టర్లతో ఇది రెండో సమావేశమని, ప్రభుత్వానికి కళ్లు, చెవులు మీరేనని సీఎం గుర్తు చేశారు. జిల్లా స్థాయిలో ప్రభుత్వానికి వారధులు.. సారధులు మీరేనని అన్నారు. ఇటీవలే రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సమర్థులైన యువ కలెక్టర్లను నియమించామని, రాజకీయ ఒత్తిళ్లు, ఎలాంటి రాగద్వేషాలు లేకుండా కలెక్టర్ల బదిలీలు చేపట్టామని తెలిపారు.

**కలెక్టర్లదే కీలక బాధ్యత..** ఐఏఎస్ అధికారుల కెరీర్‌లో జిల్లా కలెక్టర్లుగా పని చేయటమే అత్యంత కీలకమైన అవకాశమని సీఎం అన్నారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలుండే బాధ్యతలతో పాటు క్షేత్ర స్థాయిలో అన్ని అంశాలపై అవగాహన వస్తుందని, జిల్లాల్లో పని చేసిన అనుభవమే భవిష్యత్తులో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలను చివరి లబ్ధిదారుల వరకు చేరవేసే కీలక బాధ్యత కలెక్టర్లదేనని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. కలెక్టర్లు ఏ జిల్లాలో పని చేసినా.. అక్కడి జిల్లా ప్రజల మదిలో చెరగని ముద్ర వేయాలని, తాము పని చేసే ప్రాంత ప్రజలందరి అభిమానాన్ని అందుకునేలా పని చేయాలని సీఎం అన్నారు. ఇటీవల రాష్ట్రంలో ప్రభుత్వం టీచర్లకు ప్రమోషన్లతో పాటు బదిలీలు చేసిందని, కొన్నిచోట్ల టీచర్లు బదిలీపై వెళుతుంటే విద్యార్థులు సొంత కుటుంబసభ్యుడిలా స్పందించారు. వాళ్లకు అడ్డుపడి కన్నీళ్లు పెట్టుకున్న సంఘటనలు మీడియాలో చూసినట్లు సీఎం చెప్పారు. జిల్లాల్లో కలెక్టర్లు బదిలీ అయినా ప్రజల నుంచి అలాంటి స్పందన వచ్చేలా పనితీరు ఉండాలని అభిప్రాయపడ్డారు. అక్కడి ప్రజలు కలెక్టర్‌ను బదిలీ చేయకుండా అడ్డుకునేంత అను బంధాన్ని సంపాదించుకోవాలని ఉదాహరణగా చెప్పారు.

**తెలంగాణ సంస్కృతిలో ఐఏఎస్‌లు భాగం కావాలి..** వివిధ రాష్ట్రాల నుంచి వివిధ సంస్కృతుల నుంచి వచ్చిన ఐఏఎస్ అధికారులు తెలంగాణలో పని చేస్తున్నారని, విధి నిర్వహణలో భాగంగా ఇక్కడి భాష నేర్చుకుంటే సరిపోదని, భాషతో పాటు తెలంగాణ సంస్కృతిలో భాగస్వామ్యం కావాలని సీఎం రేవంత్ కలెక్టర్లకు సూచించారు. తెలంగా ణను తమ సొంత రాష్ట్రంగా భావించి పని చేయాలని, ఇక్కడి ప్రజలతో మమేకం కావాలని, ప్రజలకు ప్రయోజనం చేకూరేలా మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఒక శంకరన్, ఒక శ్రీధరన్‌లా సామాన్య ప్రజలు ఎప్పుడూ గుర్తు పెట్టుకునేలా ఐఏఎస్‌లు పని చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజల ఆలోచన ఏమిటో తెలుసుకోవాలని.. కేవలం ఏసీ గదులకే పరిమితమైతే ఎలాంటి సంతృప్తి ఉండదని అన్నారు. తాము చేపట్టే ప్రతి పని.. ఇది ప్రజా ప్రభుత్వమని ప్రజలకు తెలిసేలా ఉండాలని సీఎం రేవంత్ వివరించారు.

**క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందే..** జిల్లా కలెక్టర్లు అందరూ క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందేనని ముఖ్యమంత్రి ఆదేశించారు. పాఠశాలలు, హాస్టళ్లు, ఆస్పత్రుల ద్వారా ప్రజలకు సేవలందించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి పేద విద్యార్థిపై ప్రభుత్వం ప్రతి నెలా రూ.85వేలు ఖర్చు పెడుతుందని అన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంతో పాటు పిల్లల భవిష్యత్తును నిర్దేశించే విద్యా వ్యవస్థను సమర్థంగా తీర్చిదిద్దే చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు సూచించారు. అందుకే ప్రభుత్వ స్కూళ్లు, ఆస్పత్రులను పర్యవేక్షించాల్సిన బాధ్యత కలెక్టర్లు తీసుకోవాలని ఆదేశించారు. తనిఖీలకు వెళ్లినప్పుడు ప్రజలతో మాట్లాడాలని, అక్కడికక్కడ పరిష్కారమయ్యే చిన్న చిన్న పనులను వెంటనే పరిష్కరించాలని సీఎం రేవంత్ కలెక్టర్లకు సూచించారు.

## రైతుల ఖాతాల్లో ఈనెల 18న రూ.6వేల కోట్లకు పైగా జమ: మంత్రి తుమ్మల



హైదరాబాద్: రాష్ట్రంలో పంట రుణాల మాఫీకి సంబంధించి రైతుల ఖాతాల్లో ఈనెల 18న రూ.6వేల కోట్లకు పైగా జమ చేయనున్నట్టు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. భూమి పాస్‌బుక్ ఆధారంగానే రుణమాఫీ చేస్తామని, కుటుంబ నిర్ధారణకే రేషన్ కార్డు ప్రామాణికమని స్పష్టం చేశారు. అర్హులైతే రేషన్ కార్డు లేకున్నా రుణమాఫీ వర్తిస్తుందన్నారు. ఎమ్మెల్యేలు, ఐఏఎస్‌లు, ఉన్నతాధికారులకు రుణమాఫీ ఉండదని పేర్కొన్నారు. రాష్ట్రంలో 11.50లక్షల మంది రైతులు రూ. లక్ష వరకు రుణాలు తీసుకున్నారని తెలిపారు. దాదాపు 30లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసేందుకు రూ.31వేల కోట్లు అవసరమని మంత్రి వివరించారు. రాష్ట్రంలో పంట రుణాల మాఫీకి ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసిన విషయం తెలిసిందే. పథకం అమలు విధి విధానాలను వివరిస్తూ సోమవారం ఉత్తర్వులు (జీవో ఆర్టీ నంబరు 567) జారీ చేసింది. ఒక రైతు కుటుంబానికి గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు రుణాలను మాఫీ చేయనుంది. రైతు కుటుంబం గుర్తింపునకు తెల్లరేషన్ కార్డు(ఆహారభద్రత కార్డు)ను ప్రామాణికంగా తీసుకోనున్నట్లు ప్రకటించింది.

అన్ని షెడ్యూల్డు, వాణిజ్య, ప్రాంతీయ గ్రామీణ, జిల్లా సహకార బ్యాంకుల నుంచి 2018 డిసెంబరు 12 నుంచి మంజూరైన, రెన్యువలైన రుణాలకు, 2023 డిసెంబరు 9 వరకు బకాయి ఉన్న పంట రుణాలకు, స్వల్పకాలిక రుణాలకు ఇది వర్తిస్తుందని... రుణాల అసలు, దానికి వర్తించే వడ్డీని కలిపి రూ.2 లక్షలు మాఫీ అవుతాయని ప్రభుత్వం తెలిపింది.



## భారాస ఎమ్మెల్సీ కవితకు అస్వస్థత

దిల్లీ: మద్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటూ తిహాడ్ జైలులో ఉన్న భారాస ఎమ్మెల్సీ కవిత అస్వస్థతకు గురయ్యారు. దీంతో తిహాడ్ జైలు నుంచి ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్టు సమాచారం. దిల్లీ మద్యం కేసులో మనీ లాండరింగ్ నేరారోపణలతో అరెస్టయిన కవిత దాదాపు నాలుగు నెలలుగా జైల్లో ఉన్నారు. ఆమెపై సీబీఐ, ఈడీలు వేర్వేరు కేసులు నమోదు చేశాయి.



## బండి సంజయ్‌కు బహిరంగ లేఖ..

కరీంనగర్: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బహిరంగ లేఖ రాశారు. కేంద్ర క్యాబినేట్‌లో స్థానం దక్కించుకున్నందుకు ముందుగా బండి సంజయ్‌కు పొన్నం శుభాకాంక్షలు చెప్పారు. తెలంగాణ రాష్ట్రానికి, ముఖ్యంగా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి వచ్చే బడ్జెట్ సమావేశాల్లో కేంద్రం నిధులు కేటాయించేలా చూడాలని లేఖలో కోరారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి మరిన్ని నిధులు తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో తెలంగాణకు కేంద్రం ఇచ్చిన హామీలు, వాగ్దానాలు నెరవేర్చడంలో బండి సంజయ్ చొరవ తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.



# కొలిక్కి వచ్చేనా...!?

## తెలుగు రాష్ట్రాల విభజన సమస్యలపై కేంద్రం కీలక సమావేశం

హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల విభజన సమస్యలపై కేంద్ర ప్రభుత్వం మరోసారి దృష్టి కేంద్రీకరించింది. ఈనెల 24న ఢిల్లీలో కేంద్ర హోంశాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో కీలక సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి హాజరుకావాలని రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు కేంద్ర హోంశాఖ లేఖ రాసింది. ప్రత్యేకించి షెడ్యూల్ 13లోని అంశాలపై 24న సమావేశంలో చర్చించనుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రెండు రాష్ట్రాల మధ్య సమస్యలపై తొలిసారిగా ఈ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన ప్రధాన సమస్యలపై చర్చించనున్నారు. విభజన చట్టం షెడ్యూల్ 13లో రెండు రాష్ట్రాల్లోని విద్యాసంస్థల ఏర్పాటు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అంశాలపై మాట్లాడనున్నారు. తెలంగాణలో స్టీల్ ఫ్యాక్టరీ కోచ్ ఫ్యాక్టరీ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు , ఆంధ్రప్రదేశ్‌లోనూ కడప స్టీల్ ప్లాంటు, పలు జాతీయ రహదారుల ప్రాజెక్టులపై చర్చించనున్నారు. కొద్దిరోజుల క్రితం ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాని రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి కలిసిన సంద ర్భంలో విభజన చట్టంలోని అంశాల అమలు గురించి ప్రస్తావించిన విషయం తెలిసిందే. అటు రెండు రాష్ట్రాల మధ్య సమస్యల పరిష్కారం కోసం తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం అయిన విషయం తెలిసిందే.

**ఢిల్లీకి సీఎం చంద్రబాబు.. ఏం చేయబోతున్నారంటే..?** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ( మంగళవారం) ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఈరోజు సాయంత్రం గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో సీఎం ఢిల్లీకి వెళ్లారు. రాత్రికి అక్కడే బసచేసి రేపు(బుధవారం) పలువురు కేంద్ర మంత్రులతో ముఖ్యమంత్రి భేటీ అవుతారు. రెండు వారాల వ్యవధిలోనే రెండోసారి హస్తిన బాట పట్టడంతో చంద్రబాబు పర్యటనపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో బాబు రేపు భేటీ కానున్నారు. విభజన సమస్యల పరిష్కారం, ఇతర రాజకీయ అంశాలపై సీఎం చంద్రబాబు చర్చించనున్నారు.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## రాహుల్ కి రాహుకాలం పోయిందిగా !

కాంగ్రెస్ అగ్ర నేత గాంధీల ఐదో తరం వారసుడు రాహుల్ గాంధీకి రాహు కాలం పోయింది అని అంటున్నారు. రాహుల్ గాంధీ 2004లో పొలిటికల్ గా ఎంట్రీ ఇచ్చారు. అంటే రెండు దశాబ్దాల క్రితం. అప్పటికి ఆయన వయసు 34 ఏళ్ళు. ఆయన బాబాయ్ సంజయ్ గాంధీ ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయకపోయినా పాతికేళ్ళకే రాజకీయంగా చురుకుగా ఉంటూ వచ్చారు. ఆయన 33 ఏళ్ళలోపే అమేథీ నుంచి ఎంపీగా అయ్యారు. అదే వయసులో ఆయన మరణించారు. లేకపోతే ఆయనే ఇందిరాగాంధీకి సిసలైన వారుసుడు అయి ఉండేవారు అని అంటారు. మరో వైపు చూస్తే సంజయ్ మరణించిన తరువాత్ రాజీవ్ గాంధీ రాజకీయాల్లోకి వచ్చారు. ఆయన 1981లో కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా చేరి ఆ వెంటనే అమేథీ ఉప ఎన్నికల్లో పోటీ చేసి ఎంపీ అయ్యారు. రాజీవ్ గాంధీ ఎంపీ అయ్యేనాటికి వయసు 36 ఏళ్ళు. అయితే రాజీవ్ గాంధీ నలభయ్యేళ్ళకే దేశానికి ప్రధాని అయి సరికొత్త రికార్డుని క్రియేట్ చేశారు. ఆ రికార్డు ఎవరూ బద్ధలు కొట్టలేదు. దానికి రాహుల్ గాంధీకి అవకాశం ఉన్నా ఆయన ప్రధాని కాలేదు. ఎందుకంటే 34 ఏళ్లకే ఎంపీ అయిన రాహుల్ యూపీయే వన్ టూ లో కేవలం సాధారణ పార్లమెంట్ మెంబర్ గానే పనిచేశారు. ఆయన తలచుకుంటే 2009లో రెండవ టెర్మ్ లో ప్రధాని అయ్యేవారు. అలా 39 ఏళ్లకే ప్రధాని అయ్యే అవకాశాన్ని తోసిపుచ్చినందుకు రాహుల్ మరో రెండు దశాబ్దాలు నిరీక్షించాల్సి వస్తోంది. అదే విధంగా చూస్తే 2014లో రాహుల్ గాంధీ కాంగ్రెస్ తరపున విపక్షంలో ఉన్నారు. 2019లో అధికారంలోకి వస్తామనుకున్నా రాలేకపోయారు 2024లో అయితే దాదాపుగా దగ్గరగా వచ్చేశారు. ఇపుడు చూస్తే తాజా ఉప ఎన్నికల్లో ఇండియా కూటమి మొత్తం మోత మోగించింది. దాంతో దేశమంతా ఇండియా కూటమి గాలి వీస్తోంది. ఇక మీదట ఏ ఎన్నికలు జరిగినా పూర్తి ఆత్మ విశ్వాసంతో ఇండియా కూటమి ఎన్నికల్లో పాలు పంచుకోవడానికి ఆస్కారం ఏర్పడింది. రాహుల్ గాంధీ పార్లమెంట్ లో ప్రధాన ప్రతిపక్ష నేతగా ఎంపిక అయ్యారు. కొత్త పార్లమెంట్ లో రాహుల్ గాంధీ చేసిన తొలి ప్రసంగానికి మంచి స్పందన లభించింది. ఈ నెల 22 నుంచి ప్రారంభం కాబోతున్న బడ్జెట్ సమావేశాలలో రాహుల్ గాంధీ రెట్టించిన ఉత్సాహంతో కనిపించనున్నారు అని అంటున్నారు. దేశంలో ప్రజల మూడ్ ఏంటో ఉప ఎన్నికల ఫలితాలు వెల్లడించినందువల్ల రాహుల్ గాంధీ మోడీ సర్కార్ ని టార్గెట్ చేసుకుంటారు అని అంటున్నారు. ఈ బడ్జెట్ సమావేశాలలో రాహుల్ ని తట్టుకోవడం అధికార ఎన్డీయే కూటమికి బహు కష్టమని అంటున్నారు. అదే విధంగా చూసెతే కనుక రానున్న కాలంలో అధికార పార్టీకి ఇబ్బందులు అన్ని వైపుల నుంచి తప్పవని అంటున్నారు. ఇక రాహుల్ గాంధీ విషయం తీసుకుంటే ఆయనకు రాజకీయంగా ఇప్పటి దాకా కాలం కలిసి రాలేదు అని అంటున్నారు. ఇపుడు చూస్తే అదంతా పోయింది అని అంటున్నారు. రానున్న రోజులు అన్నీ రాహుల్ గాంధీకి మంచి రోజులే అని అంటున్నారు. ఇండియా కూటమిలో కాంగ్రెస్ పెద్ద పార్టీ. వంద దాకా ఎంపీలు ఉన్న పార్టీ. రానున్న కాలంలో గుజరాత్ ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ హిమాచల్ ప్రదేశ్, అసోం వంటి రాష్ట్రాలలో బీజేపీతో ముఖా ముఖీ తలపడే సత్తా కాంగ్రెస్ కే ఉందని అంటున్నారు. దాంతో పాటు భారత్ జోడో యాత్రను రెండు విడతలుగా చేసి రాహుల్ కాంగ్రెస్ గ్రాఫ్ పెంచారు. దాంతో పాటు తన గ్రాఫ్ ని పొలిటికల్ ఇమేజ్ ని కూడా పెంచుకున్నారు. రాహుల్ పాదయాత్ర ఫలితంగా ఉత్తరాదిన రాజకీయ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది అని అంటున్నారు. రాహుల్ లోని నాయకత్వ లక్షణాలను ఇపుడు జనాలు గుర్తించారు. అలాగే కాంగ్రెస్ మిత్రులు కూడా గుర్తించారు అని అంటున్నారు. దానికి ఉదాహరణ రెండవ మాట లేకుండా ఆయనకే ప్రధాన ప్రతిపక్ష స్థానం అప్పగించే విషయంలో ఇండియా కూటమి సహకరించడం. ఒక విధంగా వెయిటింగ్ ప్రైమ్ మినిస్టర్ గా రాహుల్ గాంధీ ఉన్నారు.

రానున్న కాలంలో రాహుల్ తన దూకుడుని మరింతగా పెంచుతారని అంటున్నారు. ఈ అయిదేళ్ళ కాలం మోడీ సర్కార్ పాలిస్తే అది అద్భుతమే అవుతుందని ఇండియా కూటమి అంటోంది. ఈ మధ్యలో ఏమైనా ఇబ్బందులు వస్తే ఈ టెర్మ్ లోనే రాహుల్ ప్రధాని అయినా ఆశ్చర్యం లేదు అని అంటున్నారు. మొత్తానికి రాహుల్ అయిదున్నర పదుల వయసులో దేశానికి ప్రధాని అవుతారా అన్నదే ఢిల్లీ వర్గాలలో కొత్త చర్చగా ఉంది అంటున్నారు.

# అపరిశుభ్ర ఆహారం.. ఆరోగ్యంపై ప్రభావం!



వికారాబాద్ : మనం తీసుకునే ఆహారమే ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. నాణ్యత లోపిస్తే ప్రభావం చూపుతుంది. నేడు చాలా మంది బయట లభించే ఆహారంపై మక్కువ చూపుతూ అనారోగ్యానికి గురవుతున్నారు. జిల్లాలో తాండూరు, పరిగి, కొడంగల్, వికారాబాద్ పట్టణాల్లో అధిక సంఖ్యలో హెూటళ్లు ఉన్నాయి. వీటిల్లో కొన్ని పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నా, మరి కొన్ని నిబంధనలు పాటించడం లేదు. జిల్లా ఆహార తనిఖీ అధికారులు చుట్టపు చూపుగా వచ్చి తనిఖీ చేస్తున్నారు. పురపాలక అధికారులే తనిఖీలు నిర్వహించి జరిమానా విధిస్తున్నారు. కనిపించని స్వచ్ఛత: వికారాబాద్ జిల్లా కేంద్రంలో హెూటళ్లు, టిఫిన్ సెంటర్లు సుమారుగా 64 వరకు ఉన్నాయి. తాండూరులో 98 వరకు ఉన్నాయి. హెూటళ్ల పరిసర ప్రాంతాలు అపరిశుభ్రతకు నిలయంగా మారాయి. మిగిలిపోయిన పప్పు, సాంబారు వేడి చేసి వడ్డిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని హెూటళ్లు మద్యం అడ్డాలుగా మారాయి. చిన్న గదుల్లో, సరియైన వెలుతురు లేని ప్రాంతాల్లో కొనసాగుతున్నాయి. నాణ్యత లేకుంటే ఆయా మున్సిపల్ కమిషనర్లకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటారు.

ఎక్కడపడితే అక్కడ..: పరిగి పట్టణంలోని హెూటళ్లలో నిబంధనలు పాటించడంలేదు. ఎక్కడ పడితే అక్కడ ఆహార పదార్థాలను విక్రయిస్తున్నారు. రోడ్ల పక్కన తినుబండారాలను అమ్ముతున్నారు. పట్టణ వ్యాప్తంగా దాదాపు 35కు పైగా హెూటళ్లు ఉన్నాయి. పరిసరాలను శుభ్రంగా ఉంచడం లేదు. స్వచ్ఛమైన తాగునీరు కూడా సరఫరా చేయడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో తనిఖీలకు అవరోధంగా మారింది.

జిల్లా ఆహార పరిరక్షణ అధికారి కార్యాల యం గతంలో పురపాలక సంఘ కార్యాలయం ఆవరణలో ఉండేది. గతేడాది కలెక్టరేట్‌కు మార్చారు. రెండు నెలలకు ఒకసారి అధికారి వచ్చి వెళుతున్నట్లు పరిశీలకులు తెలిపారు. ఈ కార్యాలయం జిల్లా అధికారి హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ విభాగంలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ సీనియర్, జూనియర్ అసిస్టెంట్, అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వికారాబాద్, తాండూరు పురపాలికల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులున్నా భర్తీ చేయడం లేదు.

నిర్వాహకులకు అవగాహన

కొడంగల్ పట్టణంలోని హెూటల్స్, టిఫిన్ సెంటర్లలో నాసిరకం వంటలు వండుతున్నారు. ఇటీవల తనిఖీ చేయగా ఓ దాబాలో నిలువ ఉంచిన మాంసం, కుళ్లిపోయిన పదార్థాలను గుర్తించారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ మాట్లాడుతూ మున్సిపల్‌లోని 56 హెూటల్స్, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించామని చెప్పారు. ఆహార విక్రయాల్లో నాణ్యత తప్పని సరిగా పాటించాలని సూచించామన్నారు. 15 రోజుల్లో ఆయా ప్రదేశాల్లో పనిచేసే వారు వైద్య పరీక్షలు చేసుకోవాలని చెప్పామన్నారు. నిర్వాహకులు ఇష్టానుసారం వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

నాణ్యత లేకుంటే చర్యలు తప్పవు

నాణ్యత లేని ఆహార పదార్థాలను విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటాం. హెూటళ్లు, ఇతర ఆహార పదార్థాల విక్రయ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహిస్తాం. వినియోగదారులు 70133 50833కు ఫిర్యాదు చేయాలి. జిల్లాలో ఇప్పటి వరకు 9 కేసులు నమోదు చేశాం. సేకరించిన నమూనాలను ప్రయోగశాలకు పంపించాం. మున్సిపాలిటీల్లో కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు చేయవచ్చు. ఎన్.జగన్నాథం, జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్.

# ఆరోగ్యానికి 'పొగ'



హైదరాబాద్: బహిరంగ చెత్త దహనం కాలుష్యానికే కాదు అగ్నిప్రమాదాలకూ కారణమవుతోంది. జలాశయాలున్న చోట చెత్తను పారేసి డంపింగ్‌యార్డుగా మారుస్తున్నారు. అనంతరం అక్కడే వ్యర్థాలను తగలబెట్టడంతో విషవాయువులు గాల్లో కలుస్తున్నాయి. అత్తాపూర్, ఫలక్‌నుమా, ఎల్బీనగర్, సికింద్రాబాద్, పాతనగరంలోని పలు ప్రాంతాల్లోని కాలనీల్లో నిత్యకృత్యంగా మారింది. చెత్తను కాల్చడాన్ని నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2017లో ఆదేశాలిచ్చినా జీహెచ్‌ఎంసీ చర్యలు శూన్యం. గ్రేటర్ పరిధిలో చెత్తను కాల్చడం ద్వారా ఏటా 3,350 టన్నుల పీఎం 2.5 ఉద్గారాలు వెలువడుతున్నాయని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. తాజాగా లాన్సెట్ అధ్యయనంలోనూ అతిసూక్ష్మకణాల స్థాయి పెరుగుతున్న కొద్దీ మరణాల సంఖ్య పెరుగుతోందని వెల్లడించింది.

అత్తాపూర్‌లో మరీ ఎక్కువ.. అత్తాపూర్‌లోని మైదానాల్లో చెత్త దహనం ఘటనలు పెరుగుతున్నాయి. మూసీ వెంబడి చెత్త పోగవ్వడంతో బల్దియా కార్మికులే తగులబెడుతున్నారంటూ ఫిర్యాదులు చేస్తున్నారు. కాలనీల్లో ఖాళీ మైదానం కనిపిస్తే చెత్త పారేయడం రాత్రివేళల్లో దహనం చేస్తుండటంతో ఊపిరాడటం లేదని ఫిర్యాదు చేస్తున్నారు. ఫలక్‌నుమా లోనూ ఇదే దుస్థితి.

చెత్త దహనంతో కాలుష్యం.. ప్లాస్టిక్ వ్యర్థాలు, పాతటైర్లు, దుస్తులు, కార్టన్, రసాయన డబ్బాలు, జంతు కళేబరాలు తదితరాలన్నీ గార్బేజ్ పాయింట్లవద్ద వారాల తరబడి పేరుకుపోతున్నాయి. చుట్టుపక్కలవారు, పారిశుద్ధ్య సిబ్బందే దహనం చేస్తున్నారు. ప్రధానంగా మియాపూర్, కొండాపూర్,గచ్చిబౌలి,మణికొండ, ఉప్పల్, నాగోల్, బాలానగర్, యూసుఫ్‌గూడ, కూకట్‌పల్లి, అంబర్‌పేట్, చాదర్‌ఘాట్, మలక్‌పేట్, సైదాబాద్, సంతోష్‌నగర్, యాకుత్‌పురాల్లో ఎక్కువగా ఉంది. పీఎం2.5స్థాయులు భారీగా నమోదవుతున్నాయి.

రూ.5వేల నుంచి రూ.25వేల వరకు జరిమానా..

బహిరంగంగా వ్యర్థాలను కాల్చివేస్తే రూ.25వేల వరకు పెనాల్టీ విధించాలన్న నిబంధనలున్నాయి. జీహెచ్‌ఎంసీ సైతం రూ.5వేల నుంచి రూ.25వేల వరకు జరిమానాలు విధించేలా నిబంధనలున్నా..కనీస చర్యలు తీసుకోవడం లేదు.

దుష్పరిణామాలేంటి..?చెత్తను కాల్చడం ద్వారా కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్, కంటికి కనిపించని ధూళికణాలైన పీఎం 2.5 పరిమాణం గాలిలో పెరుగుతుంది. ప్రతి ఘనపు మీటర్ గాలిలో 2.5 మైక్రాన్ల వ్యాసం గల కాలుష్యాలు ఊపిరితిత్తుల్లోకి చొరబడి ఆరోగ్యాన్ని ధ్వంసం చేస్తాయి. ప్రతి ఘనపు మీటర్ గాలిలో 10 మైక్రాన్ల వ్యాసం గల కాలుష్యాలు ముక్కు, గొంతు వరకు వెళ్లి ఇబ్బంది కలిగిస్తాయి. పీసీబీ నిర్దేశిత పరిమితుల ప్రకారం..పీఎం 2.5 తీవ్రత నగరంలో అది 69 నుంచి 89 ఎంజీలుగా ఉంది. పీఎం 10స్థాయి 150 ఎంజీలుగా ఉంది.

# నిధుల్లేవు.. నిర్వహణ లేదు

సిరిసిల్ల : పట్టణాలకు అనుసంధానించే రహదారులు బాగుంటే గ్రామీణుల రాకపోకలు సజావుగా సాగుతాయి. జిల్లాలో రెండేళ్లలో వరుసగా కురిసిన వర్షాలకు రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. శాశ్వత మరమ్మతులకు నోచుకోకపోవడంతో మరింత అధ్వానంగా తయారయ్యాయి. కోతకు గురైన చోట తాత్కాలికంగా మట్టితో చదునుచేసి సరిపెట్టారు. వాహనాల రాకపోకలకు చిన్నపాటి వర్షాలకు మట్టికొట్టుకుపోయి.. తారు చెదిరిపోయి ప్రయాణం నరకప్రాయంగా మారింది. నిధుల కోసం ప్రభుత్వానికి రెండేళ్లుగా నివేదికలు పంపినా కేటాయింపుల్లేవు. జిల్లాలో పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోని రహదారుల అధ్వాన స్థితిపై కథనం.

జిల్లాలో పంచాయతీరాజ్ రహదారులు 341 కిలోమీటర్లు ఉన్నాయి. వీటిలో 2022, 2023 సంవత్సరంలో భారీ వర్షాలకు 159.63 కిలోమీటర్లు దెబ్బతిన్నాయి. అంటే జిల్లాలో పల్లె రహదారులు 47 శాతం అధ్వానంగా ఉన్నాయి. రహదారులు కోతకు గురై తారు కొట్టుకుపోయిన చోట తాత్కాలికంగా మట్టితో చదును చేశారు. నీటిప్రవాహం ఉన్నచోట కల్వర్టుల వద్ద పైపులువేసి మట్టితో చదును చేశారు. వీటిపై వాహనాల రాకపోకలతో కొన్ని చోట్ల దెబ్బతిని అధ్వానంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో నడవలేని పరిస్థితి నెలకొంది. ఇలా జిల్లా వ్యాప్తంగా దెబ్బతిన్న రహదారులు, కల్వర్టుల వద్ద తాత్కాలిక మరమ్మతులు చేశారు. వీటికి శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేసేందుకు రూ.32.88 కోట్ల నిధులు కావాలని పంచాయతీరాజ్‌శాఖ ప్రభుత్వానికి నివేదికలు తయారు చేసి పంపారు. ఈ నిధులు వస్తే రహదారులు బాగయ్యే అవకాశం ఉంది. కానీ రెండేళ్లుగా జిల్లాలోని డీఎంఎఫ్‌టీ నిధులతో తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెట్టారు. అవి కూడా నిబంధనలకు మించి ఎక్కువ ఖర్చు చేశారని ఆడిట్‌లో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ ఏడాది కనీసం మరమ్మతులు చేయలేని పరిస్థితి ఉంది. ఇప్పటికీ ప్రభుత్వం నుంచి పైసా నిధులు రాలేదు.

కిలోమీటరుకు రూ.58 లక్షలు

పంచాయతీరాజ్‌శాఖలో రహదారులు నిర్మాణానికి ప్రభుత్వం కిలోమీటరుకు రూ.58 లక్షలు కేటాయిస్తోంది. ఇంత పెద్దమొత్తంలో నిధులు



వెచ్చిస్తున్నా రహదారుల నాణ్యత మూన్నాళ్ల ముచ్చటగా మారుతోంది. ఒకే వరుసలో తారుతో నిర్మాణాలు చేపట్టే ఈ రహదారులు పటిష్ఠంగా ఉండాలి. కానీ పలు రహదారులు ఏడాది రెండేళ్లకే వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నాయి. మోకాళ్ల లోతు గుంతలతో అస్తవ్యస్తంగా మారాయి. కల్వర్టులు కట్టినా రహదారులతో సరిగా అనుసంధానించకపోవడంతో అక్కడ వాహనదారులు ఇబ్బంది పడటంతో పాటు వాహనాలు దెబ్బతింటున్నాయి. రహదారుల నిర్మాణం తర్వాత సైడ్‌బర్మ్‌లు సరిగ్గా పోయకపోవడంతో వాహనాలు రహదారులు దిగితే ఎక్కలేని పరిస్థితి నెలకొంది.

మరమ్మతులు చేయిస్తాం..

వర్షాలకు దెబ్బతిన్న రహదారుల మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. ఆలస్యమవడంతో రహదారులు మరింత అధ్వానంగా మారుతున్నాయి. శాశ్వత రహదారుల నిర్మాణం పూర్తయ్యాక అయిదేళ్లపాటు గుత్తేదారు నిర్వహణ చూడాలి. ఎక్కడైనా రహదారులు దెబ్బతింటే వారితో మరమ్మతులు చేయిస్తాం. గుత్తేదారుకు చెల్లించాల్సిన కొంత మొత్తం శాఖ దగ్గర ఉంటాయి. వారు మరమ్మతులు చేయకపోతే ఆ మొత్తం వారికి చెల్లించం. నాణ్యత లోపిస్తే గుత్తేదారులపై చర్యలు తీసుకుంటాం. సూర్యప్రకాశ్, ఈఈ పంచాయతీరాజ్‌శాఖ

# ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన





**ఇంద్రవెల్లి జూలై 16 (ప్రభాత సమాచారం)**

వానాకాలంలో పంటలు సాగు చేసిన రైతులకు ఎరువుల వాడకంపై అవగహన కల్పించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు శాస్త్రవేతలు శ్రీదేవి, శ్రీనివాస్ పంటలకు ఎరువులు ఎంతమోతాదులో వాడలనేది వివరించి అవగహన కల్పించారు. అన్ని రకాల పంటలతో పాటు పసుపు పంటలకు ఏరకమైనా ఎరువులు వాడలనేది తెలపడం జరిగింది. పంటల ఎదుగుదలను బట్టి ఎరువులు వాడాలని సూచించారు. రసాయన ఎరువులను తగ్గించి సేంద్రియా ఎరువులు అధికంగా వాడితే పంటలకు అన్ని రకాల మేలు జరుగుతుందని తెలిపారు. వ్యవసాయ రైతులు తప్పకుండా శాస్త్రవేతల సలహాలు, సూచనలు పాటించి పంటలు సాగు చేస్తే అధికంగా దిగుబడిని సాధించడం సులభతరం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఏవోలు గణేశ్, అరుణ, ఏఈవోలు మల్లేష్, వీర, వివేక్, నవతేజ్, కరుణ, రైతులు గోపినాథ్, చందర్ సెన్, నిధ్యాన్ సింగ్, చంద్రకాంత్, రాము, నాగోరావ్, తదితరులు పాల్గొన్నారు.

# ట్రైకార్ చైర్మన్ ను కలసిన తెలంగాణ ఉద్యమ జేఏసీ మాజీ కన్వీనర్ రాథోడ్ అనిల్



**ఇంద్రవెల్లి జూలై 16 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ తెగల ఆర్థిక సహకార సంస్థ ట్రైకార్ చైర్మన్ గా ఎన్నికైన డా. తేజావత్ బెల్లయ్య నాయక్ ను హైదరాబాద్ లోని అయన కార్యాలయం తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ జేఏసీ మాజీ కన్వీనర్ ఇంద్రవెల్లి అనిల్ రాథోడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

# ఇంద్రవెల్లిలో భారీ వర్షం.. జలమయమైన రోడ్లు



**ఇంద్రవెల్లి జూలై 16 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో మంగళవారం ఉదయం నుండీ ఆకాశం మేఘావృతమై దినమంతా భారీ వర్షం కురిసింది. దీంతో మండల కేంద్రంలోని ప్రధాన రహదారి జలమయమైంది. మండల కేంద్రంలోని బుద్ధనగర్ కాలనిలో గల రోడ్డుపై భారీగా వరద నిరు చేరడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి.

# ప్రభుత్వ భూములను పర్యవేక్షించాలి....

మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త)మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ప్రతి మండలం లో ఉన్న ప్రభుత్వ భూములను అన్యకాంతం కాకుండా చూడాలని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం రోజున జె సి ఛాంబర్ లో సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ




సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి మండలంలో సర్వే ల్యాండ్ కింద పెండింగ్ ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ భూములను పర్యవేక్షించే బాధ్యత మీపై ఉందన్నారు. ప్రతి మండలంలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించాల న్నారు.

# దోమ ఖర్చు ఇంతింత కాదయా..

గోదావరిఖని : అపరిశుభ్ర పరిసరాలు.. మురుగు నీటి నిల్వలు.. దోమల వృద్ధికి కారణమవుతుండగా.. వాటి నివారణ కోసం జనం పెడుతున్న ఖర్చు ఉమ్మడి జిల్లాలో ఏటా రూ.కోట్లలో ఉంటోంది.. పేదల నుంచి శ్రీమంతుల వరకు ప్రతి ఒక్కరూ దోమల బాధితులే.. దీంతో పేదలు మస్కిటో కాయిల్స్‌ను నమ్ముకుంటే మధ్య తరగతి, ఎగువ తరగతి వారు దోమల బ్యాట్లు, రిపెల్లెంట్స్‌తో దోమల బారి నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.. పరిసరాల పరిశుభ్రతపై ఇటు జనం.. అటు స్థానిక సంస్థల పాలకవర్గాలు దృష్టి పెడితే ఈ వ్యయం.. రోగాల భయం తగ్గుతుంది..నాలుగు గదుల ఇల్లు ఉండే ప్రతి కుటుంబం నెలకు రూ.250 వరకు సంవత్సరానికి రూ.3 వేలు రిపెల్లెంట్స్, కాయిల్స్ కోసం వెచ్చిస్తున్నారు.ఒక్కో రిపెల్లెంట్ ధర రూ.70 నుంచి రూ.80 వరకు ఉంటుంది. దోమల బ్యాట్‌లు రూ.100 నుంచి రూ.300ల వరకు ఉంటాయి. దోమలను సంహరించే రిపెల్లెంట్స్, ఉపకరణాల వ్యాపారం ఏటా ఉమ్మడి జిల్లాలో రూ.8 కోట్ల వరకు జరుగుతుందని తెలంగాణ వినియోగదారులు, పంపిణీదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్‌శర్మ తెలిపారు.

**జ్వరాల వ్యయం..**

నలుగురు సభ్యులున్న ఒక్కో కుటుంబం జ్వరాల కారణంగా ఏటా రూ.5 వేల నుంచి రూ.30 వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది. దోమల వల్లే ఎక్కువ శాతం జ్వరాలు ప్రబలుతాయి. సాధారణ జ్వరమైనా



త్వరగా తగ్గకుంటే రక్త పరీక్షలకు రూ.600 వరకు వెచ్చించాల్సి వస్తుంది. అదె డెంగీ అయితే రూ.2 వేల వరకు వసూలు చేస్తున్నారు. ప్రైవేటు వైద్యుడి వద్దకు వెళ్తే ఓపీ రుసుమే రూ.250 నుంచి రూ.500 వరకు ఉంటుంది. ఇక మందులకు తీవ్రతను బట్టి రూ.1000 నుంచి రూ.2000 వరకు ఖర్చు తప్పదు. కుటుంబంలో నలుగురికి సాధారణ వైరల్ జ్వరం సోకినా మొత్తం రూ.4000 వరకు వెచ్చించాల్సి ఉంటుంది. ఇక తీవ్ర జ్వరాలైతే ఖర్చు అధికం.

**స్థానిక సంస్థలు దృష్టి పెట్టాలిలా..**

స్థానిక సంస్థలు ఇంటింటి నుంచి చెత్త సేకరణ పకడ్బందీగా చేపట్టాలి. ఎవరైనా బహిరంగంగా పడేస్తే జరిమానాలు విధించాలి.

మురుగు నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు పూడికలు తీసివేయాలి. ఎక్కడైనా నిలిచిన చోట ఆయిల్ బాల్స్ వేయడం ద్వారా దోమల వృద్ధి నియంత్రించొచ్చు.

ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

**ఇలా చేయలేమా..**

ప్రతి కుటుంబం ఒక ఇంకుడు గుంతకు రూ.8 వేలు వెచ్చించి నిర్మించుకుంటే మురుగు నీరు భూమిలోకి ఇంకి దోమల బెడద తగ్గడంతోపాటు భూగర్భ జలాలు పెరుగుతాయి.

ప్రతి వారం డ్రై డే పాటించాలని అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో, ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. పూల కుండీలు, డ్రమ్ములు, నీటి తొట్టిలు ఇలా నీరు నిల్వ ఉన్న వాటన్నింటిని నుంచి నీరు తీసివేయాలి. దీంతో దోమల సంతతి వృద్ధి చెందకుండా ఉంటుంది.

ఇంటి చుట్టుపక్కల చెత్త చేరకుండా చూసుకోవాలి. చెత్త కుప్పలు. మురుగు నీటి నిల్వలు దోమల విజృంభణకు కారణమవుతాయి.

మన ఇంటి ఆవరణలో ఉన్న మరుగుదొడ్ల గొట్టాల పై భాగంలో నెట్ (వల)తో మూసివేయాలి. ఫలితంగా పైపు గొట్టాల్లో దోమలు వృద్ధి చెందకుండా ఉంటాయి. లేదంటే పైపు లోపల స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని అక్కడి నుంచి వృద్ధి చెందుతాయి.

ఉమ్మడి జిల్లా జనాభా : సుమారు 40 లక్షలు

కుటుంబాలు : సుమారు 10 లక్షలు

దోమల నివారణకు ఏటా ఒక కుటుంబం సగటు ఖర్చు :
రూ.500 నుంచి రూ.3 వేలు

ఏటా ఉమ్మడి జిల్లాలో దోమల నివారణ ఉపకరణాలు, రిపెల్లెంట్స్, కాయిల్స్ వ్యాపారం : సుమారు రూ.8 కోట్లు

# ముందస్తు ఒప్పందం మేలు

జగిత్యాల : జిల్లాలో యాసంగితో పాటు వానాకాలంలోనూ పలు పంటల్లో రైతులు విత్తనోత్పత్తి చేపడతారు. ఇక్కడి వాతావరణం, నేలలు, సాగునీటి వసతి రీత్యా అన్ని పంటల్లోనూ సూటి రకాలు, సంకర రకాల్లో విత్తనోత్పత్తికి అత్యంత అనువుగా ఉంటుంది. ఇదే తరుణంలో విత్తనాలను ఉత్పత్తి చేయించిన పలు కంపెనీలు పంట పండిన తరువాత బైబ్యాక్ తీసుకునే సమయంలో ధర తగ్గించటం, డబ్బులను ఎగవేయటం, తూకంలో మోసాలు, కొనుగోలుకు నిరాకరణ వంటి సమస్యలను సృష్టిస్తున్నారు. సంకర మక్క, సంకర పత్తి, ఆవాలు, ఎర్రజొన్న, తెల్లజొన్న, సజ్జ, పెసర, మినుము, జనుము, సూటివరి, సంకరవరి, నువ్వులు తదితర పంటల్లో 65 వేల ఎకరాల్లో విత్తనాలను ఉత్పత్తి చేపడుతున్నందున రైతులకు నష్టంవాటిల్లకుండా చూడాల్సిఉంది.విత్తన చట్టం విత్తన కంపెనీల కొర్రీలు, మోసాలను నివారించేలా ఒప్పందసాగును చట్టబద్ధం చేస్తూ రాష్ట్రప్రభుత్వం జీవో ఎం.ఎస్ 32 ద్వారా 2017లో ఉత్తర్వులు జారీచేసింది. ఇటీవల చాలామంది రైతులు విత్తనోత్పత్తివైపు మళ్లుతున్నందున ఒప్పంద సాగు చట్టాన్ని పక్కాగా అమలు చేయాల్సి ఉంది. ఈ చట్టం ప్రకారం విత్తనోత్పత్తి చేయించే కంపెనీ లేదా వ్యక్తి రైతులతో పంటను పండించాలనుకుంటే ముందుగా మార్కెటింగ్ శాఖవద్ద లైసెన్స్ తీసుకోవాలి. పండించదలచిన పంట, విస్తీర్ణం, రైతులతో చేసుకున్న ధరల ఒప్పందం తదితరాలన్నీ ప్రభుత్వ అధికారులకు పంటకు ముందుగానే సమర్పించాలి. ప్రభుత్వ మద్దతు ధరకన్నా తక్కువ ధరకు కొనకూడదు. ముందుగా చెప్పిన ధరకే పండిన పంటను తీసుకోవాలి. పంటను తరలించిన మరుసటి రోజునే రైతుల బ్యాంకు ఖాతాలో డబ్బులను జమచేయాలి. రైతుల భూములపై కంపనీలకు ఎలాంటి హక్కుండదు. ఏవేని వివాదాలు తలెత్తితే మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదుచేస్తే అధికారులు పరిశీలించి నెల రోజుల్లోపు పరిష్కరిస్తారు.

**రాతపూర్వకంగా..**విత్తనోత్పత్తి చేపట్టే రైతులు ముందుగా తోటి రైతుల అనుభవాలను తెలుసుకోవాలి. లైసెన్స్‌గల కంపెనీలతో ముందస్తు రాతపూర్వక ఒప్పందం చేసుకొని విత్తనోత్పత్తి చేపట్టాలి. రైతులు సంఘటితంగా విత్తనోత్పత్తి చేపట్టినపుడు ధరనిర్ణయం, విక్రయంలో ఇబ్బందులు తలెత్తవు.- సీహెచ్.రాంచందర్, వ్యవసాయ సహాయ సంచాలకులు

# చేతికి అసంతృప్తి సెగ..!



హైదరాబాద్ : రాజధాని పరిధిలో భారాస ఎమ్మెల్యేల చేరికలు కాంగ్రెస్ పార్టీలో విబేధాల కుంపట్లను రగిలిస్తున్నాయి. 20 ఏళ్లుగా పార్టీ బలోపేతానికి పని చేసిన తమను కాదని భారాస ఎమ్మెల్యేలను చేర్చుకోవడం తమకు అన్యాయం చేయడమేనని సీనియర్ నేతలు కొందరు మండిపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లు కొనసాగాలంటే తప్పనిసరిగా భారాస ఎమ్మెల్యేలను చేర్చుకోవాల్సిందేనంటూ ఆ పార్టీ సీనియర్ నేతలు నియోజకవర్గ స్థాయి నేతలకు నచ్చజెబుతున్నారు. అయినా కొంతమంది ఆందోళనలకు సిద్ధపడుతుండటంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రంగంలోకి దిగి సంబంధిత నాయకులతో మాట్లాడి అన్యాయం జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటానని హామీ ఇస్తున్నారు. ఏదో అనుకుంటే.. రాజధాని పరిధిలో భారాస తరఫున 18 మంది ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారు. వీరిలో ఇప్పటివరకు ముగ్గురు కాంగ్రెస్‌లో చేరారు. మరో ఆరుగురు ఎమ్మెల్యేలు రేపోమాపో చేరడానికి సిద్ధమవుతున్నారు. గత ప్రభుత్వంలో కీలక పాత్ర పోషించిన మాజీ మంత్రి కూడా చేరేందుకు రంగం సిద్ధమైనట్లు చెబుతున్నారు. భారాస ఎమ్మెల్యేల చేరికలతో సంబంధిత నియోజకవర్గాల్లోని కాంగ్రెస్ నేతలు ఆందోళన చెందుతున్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నామినేటెడ్ పదవులు పొందాలని కొంతమంది ప్రయత్నిస్తున్నారు. కానీ భారాస ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడంతో సంబంధిత నియోజకవర్గాల్లో తమ పాత్ర ఉండదని, కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు వారి అనుచరులకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెబుతున్నారు.

**హామీ ఇచ్చినా..** ఖైరతాబాద్ భారాస ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరడంతో.. ఆయనపై పోటీ చేసి ఓడిన విజయారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో తగిన న్యాయం చేస్తామని కాంగ్రెస్ అగ్రనేతలు హామీ ఇచ్చారు. చేవెళ్ల భారాస ఎమ్మెల్యే కాలె యాదయ్య ఇటీవలే కాంగ్రెస్‌లో చేరారు. దీనిపై స్థానిక కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మొన్నటి ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీ చేసి కేవలం 282 ఓట్లతో ఓడిపోయిన భీంభరత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయగా.. ఆయనతో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. యాదయ్యతో స్థానిక కాంగ్రెస్ నేతలు పెద్దగా కలవడం లేదు. భారాస నుంచి వచ్చిన నేతలే ఆయనతో ఉంటున్నారు. రాజేంద్ర నగర్ భారాస ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ కాంగ్రెస్‌లో చేరారు. ఇక్కడ కూడా ఇదే విధమైన పరిస్థితి ఉంది. శేరిలింగంపల్లితో పాటు మరికొన్ని నియోజకవర్గాల్లో నేతలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# వేతనాలు రాక.. అవస్థలు తప్పక



కోనరావుపేట : గత ప్రభుత్వం గ్రామ పంచాయతీలను బలోపేతం చేయటానికి నూతన పంచాయతీరాజ్ చట్టం రూపొందించి అమలు చేసింది. గ్రామాలను ఆహ్లాదకరంగా తీర్చిద్దిద్దటానికి, ప్రజలకు ఆరోగ్యకర వాతావరణం అందించేందుకు 500లకు ఒకరి చొప్పున మల్టీపర్పస్ సిబ్బందిని నియమించింది. పంచాయతీ సిబ్బంది మురుగునీటి కాలువలను శుభ్రం చేయటం, జనావాసాలు, పుర వీధుల్లోని చెత్తను ట్రాక్టర్లలో నింపి గ్రామ శివారులోని డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. క్రమం తప్పకుండా విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి ఎనిమిది నెలలుగా వేతనాలు అందక కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సిన పరిస్థితి.

**జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో 60 పైగా గిరిజన తండాలు, అనుబంధ, శివారు గ్రామాలు అయిదేళ్ల క్రితం నూతన గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాయి. గత ప్రభుత్వం జనాభా ఆధారంగా ప్రతి పంచాయతీకి చెత్త సేకరణకు ట్రాక్టర్ కొనుగోలు చేసింది. ట్రాక్టర్ నిర్వహణకు డ్రైవర్‌తో పాటు సఫాయి, నీటి సరఫరా (పంపుమెన్) సిబ్బందిని నియమించారు. ఒక్కొక్క సిబ్బందికి నెలకు రూ.9,500 వేతనం అందించారు. రెండేళ్లుగా కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధికి అందించే ప్రత్యేక నిధులు నిలిచిపోయాయి. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అందించే 15వ ఆర్థిక సంఘం నిధులు 10 నెలలుగా అందటం లేదు. చిన్న గ్రామ పంచాయతీల్లో నిధుల కొరత వెంటాడుతోంది.

**కూలీ డబ్బులతో వెళ్లదీస్తున్నాం**

ఎనిమిది నెలలుగా వేతనాల కోసం ఎదురు చూస్తున్నాం. గ్రామంలో నిత్యం పారిశుద్ధ్యం చేపడుతున్నా వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. కుటుంబ సభ్యులు చేసే దినసరి, వ్యవసాయ కూలీ డబ్బులతో కాలం వెళ్లదీస్తున్నాం.

కొటగళ్ల శాంతవ్వ, పారిశుద్ధ్య సిబ్బంది, మంగళ్లపల్లి

**అప్పు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నా**

భార్య దినసరి కూలీగా పని చేస్తోంది. కూతురు వివాహానికి చేసిన అప్పుకు తోడు వేతనాలు అందక కుటుంబ పోషణకు అప్పు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నా. ప్రభుత్వం స్పందించి మల్టీపర్పస్ సిబ్బందికి నెలనెల సకాలంలో వేతనాలు అందిస్తే రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తాం.


గుర్రం అంజయ్య, ట్రాక్టర్ డ్రైవర్, మర్తన్‌పేట

**పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నాం**

గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి వేతనాలు చెల్లించేలా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామ పంచాయతీలకు నిధుల విడుదల కొంతకాలంగా నిలిచిపోయింది. పెద్ద గ్రామ పంచాయతీల్లో వేతనాల సమస్య లేదు. చిన్న గ్రామ పంచాయతీలకు నిధుల లేమి, ఆదాయం లేక నెలల తరబడి వేతనాలు లేక అవస్థలు పడుతున్నారు. అయినప్పటికీ ఇంటి, కుళాయి, ఇతర పన్నులు వసూలు చేయించి సిబ్బందికి వేతనాలు చెల్లిస్తున్నాం.

వీర బుచ్చయ్య డీపీవో రాజన్న సిరిసిల్ల

# నిధులందితే ఆయకట్టుకు జీవం!



జగిత్యాల : రాష్ట్ర ప్రభుత్వం తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం కలిగించే ప్రాజెక్టులను మొదటి ప్రాధాన్యంగా పూర్తి చేయాలని సంకల్పించింది. ఈ మేరకు నీటిపారుదలశాఖ అధికారులు అంచనాలు సిద్ధం చేయగా ఇందులో ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాజెక్టులు కూడా ఉండగా బడ్జెట్లో నిధుల కేటాయింపుతోనే ఆయకట్టు స్థిరీకరణ సాధ్యమవనుంది.


**సదర్‌మాట్ ప్రాజెక్టు :** గోదావరిపై జగిత్యాల, నిర్మల్ జిల్లాల మధ్యలో రూ.587 కోట్లతో చేపట్టిన సదర్‌మాట్ ప్రాజెక్టు నిర్మాణం తుది దశలో ఉంది. మరో రూ. 13.64 కోట్ల నిధులతో పనులు పూర్తికానుండగా ఇందులో 1.58 టీఎంసీల నీటిని నిల్వ చేస్తారు. 55 గేట్లు, 967 మీటర్ల గల ప్రాజెక్టు పరిధిలో రెండు జిల్లాల్లో 18 వేల ఆయకట్టు ఉండగా ఇందులో 12 వేల ఎకరాల కొత్త ఆయకట్టు ఉండనుంది. ఇందులో జగిత్యాల జిల్లాలో 4,896 ఎకరాలకు సాగునీరందనుండగా ఈ నెలాఖరున సీఎం చేతుల మీదుగా ప్రారంభించే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

**ఎల్లంపల్లి :** కాళేశ్వరం, సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టుల నుంచి ఎత్తిపోసిన నీటితోపాటుగా ఎగువ నుంచి వచ్చే వరద నీటిని నిల్వచేసి నంది, గాయత్రి పంపు హౌసుల ద్వారా భూమిపైకి ఎత్తిపోసేలా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఉపకరిస్తోంది. 22.500 టీఎంసీల నీటినిల్వగల ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా 1.54 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. ఎల్లంపల్లి జలాలను వరదకాలువ ద్వారా ఎస్సారెస్పీలోకి ఎత్తిపోసేలా రూ. 1,950 కోట్లతో చేపట్టిన పునరుజ్జీవ పథకం పూర్తయ్యింది. ఈ క్రమంలో మధ్య మానేరులో 27.500, దిగువ మానేరులో 22.034 టీఎంసీల నీటినిల్వకు అవకాశం కూడా ఏర్పడింది. మల్యాల మండలంలో వరద కాలువ 88.400 కి.మీ.ల వద్ద లింకు కాలువను తవ్వి 97.460 కి.మీ.ల తాటిపల్లి వద్ద కాకతీయ కాలువలోకి నీటిని తరలించేలా రూ.36.82 కోట్లతో అనుసంధాన కాలువ నిర్మాణం పూర్తికాగా వరద కాలువలోని నీరు కాకతీయ కాలువలోకి చేరి డి-70 నుంచి డి-94 వరకు గల డిస్ట్రిబ్యూటర్ల పరిధిలో పంటలకు పారుతుంది. తద్వారా ఎస్సారెస్పీపై భారం తగ్గుతుంది, ధర్మపురి, చొప్పదండి, రామగుండం, మంథని, పెద్దపల్లి, కరీంనగర్ నియోజకవర్గాల్లోని 2.51 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించొచ్చు.

**ఇతర ప్రాజెక్టులు :** ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఎత్తిపోసిన నీటితో పెద్దపల్లి జిల్లాలోని దేవికొండ వద్ద 7.78 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించ తలపెట్టిన పత్తిపాక జలాశయానికి నిధుల విడుదలకు ప్రతిపాదించారు. అలాగే జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలో రూ.153 కోట్లతో చేపట్టిన రోళ్లవాగు ఆధునికీకరణ చివరి దశకు చేరగా ప్రాజెక్టుకు గేట్లను అమర్చాల్సి ఉంది. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే దాదాపుగా 25 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఎస్సారెస్పీ మొదటి దశలో 0-146 కి.మీ.లు ఎల్ఎండి ఎగువ వరకు, 146- 284 కి.మీ ఎల్ఎండి దిగువన గల రెండోదశ ఆయకట్టులో తూములు, డ్రాపులు, షట్టర్ల మరమ్మతులు, కాలువల లైనింగ్ తదితరాలకు రూ.658 కోట్లవరకు విడుదల చేయాల్సిఉంది. అలాగే ఎగువ మానేరు, రాళ్ల వాగు, బొగ్గుల వాగు తదితర ప్రాజెక్టుల పరిధి చివరి ఆయకట్టుకు నీటిని చేర్చటం, ఉమ్మడి జిల్లాలో రూ.311 కోట్లతో చేపట్టిన 75 చెక్‌డ్యాంల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. కాకతీయ, వరద కాలువల నుంచి 600 గొలుసుకట్టు చెరువుల్లోకి తలపెట్టిన నీటి తరలింపు తూములు, పైపు లైన్లు, కాలువల నిర్మాణాన్ని పూర్తి చేయటం, గోదావరి నుంచి 26 గ్రామాలకు గల ఎత్తిపోతల పథకాల పూర్తి, పాతవాటికి మరమ్మతులకు నిధులను విడుదల చేయటం ద్వారా ఉమ్మడి జిల్లాల్లోని పూర్తి ఆయకట్టు క్రమంగా స్థిరీకరించొచ్చు.

# ప్రైవేటు బడి.. అడ్డగోలు దోపిడీ!

కరీంనగర్ : కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో అన్ని తరగతుల పుస్తకాలు, నోట్‌బుక్‌లు విక్రయిస్తున్నారు. వీటి ధర ఒక్కో తరగతికి రూ.8 వేలకు పైమాటే. పాఠశాలలోనే దర్జాగా వాటిని విక్రయిస్తున్నారు.ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విక్రయించేవి లేదా వారు చెప్పిన దుకాణాల్లో కొనుగోలు చేసే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులకు వారు చెప్పిందే ధరగా నిర్ణయించారు. బయట మార్కెట్లో దొరికే వాటిని పాఠశాలల్లో లభించే వాటికి ధరల్లో వ్యత్యాసం ఉంటోంది. ఇక్కడ కూడా జాగ్రత్తపడుతూ కమిషన్లను పుచ్చుకుంటూ వారు అమలు చేసే పాఠ్యపుస్తకాలను మార్కెట్లో వారు చెప్పిన దుకాణంలో తప్ప మరెక్కడా దొరకకుండా జాగ్రత్త పడుతున్నారు. కార్పొరేట్ స్థాయి, పేరున్న ప్రైవేటు పాఠశాలల్లో ప్రాథమిక తరగతుల నుంచి 8వ తరగతి వరకు రూ.3 వేల నుంచి రూ.6 వేల వరకు పుస్తకాలు, నోట్‌బుక్కులకు వెచ్చించే పరిస్థితి నెలకొందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. బాగా బ్రాండ్ ఇమేజ్ గల పాఠశాలల్లో వాటి ధరలు ఇంకా అధికంగా ఉంటున్నాయని చెబుతున్నారు. ఐఐటీ తరగతులు చదివే వారికి వాటి ధరలు రూ.6 వేలకు పైగా నిలుస్తున్నాయని చెబుతున్నారు. సాధారణ ప్రైవేటు పాఠశాలల్లో రూ.2 వేల నుంచి రూ.4 వేలలోపు ఉంటున్నాయని తల్లిదండ్రులు చెబుతున్నారు. యాజమాన్యాలు సూచించిన చోటే కొనుగోలు తప్పనిసరి చేశారు. దీంతో వాటి కొనుగోళ్లకు రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు తల్లిదండ్రులు ఖర్చు చేయాల్సి వస్తోంది. పాఠశాల లోగోలు, ఒకే వద్ద యాజమాన్యాలు సూచించిన డిజైన్‌లలో దుస్తులను కుట్టిస్తుండటంతో వాటి కొనుగోలు తల్లిదండ్రులకు తప్పడం లేదు.కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు విద్యాసంస్థల పుస్తకాలను ఒకే



దుకాణంలో విక్రయిస్తున్నారు. 1 నుంచి 8 తరగతుల వరకు రూ.7 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇలా.. పలు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో దుస్తులు, పుస్తకాలు, టై, బెల్టు వంటి వాటిపై అక్రమ వ్యాపారం నడుస్తోంది. యాజమాన్యాలు చెప్పిన చోటే, చెప్పిన ధరలకే తల్లిదండ్రులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితిని కల్పించారు. ఊహించని భారంతో తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు.

**నిబంధనలకు తిలోదకాలు**

పుస్తకాలు, నోట్‌బుక్కులు, ఇతర సామగ్రి ప్రైవేటు పాఠశాలల్లో అమ్మరాదని స్పష్టమైన నిబంధనలు ఉన్నాయి. బహిరంగ మార్కెట్‌లో దొరికే పుస్తకాలు మినహా మిగిలిన వాటిని అమ్మరాదనే నిబంధనలున్నా అమలు లేదు. బయట మార్కెట్‌లో దొరకని పుస్తకాలు, ఇతర సామగ్రిని ఎంచుకొని పలు ప్రైవేటు పాఠశాలలు యథేచ్ఛగా వాటి పేరుతో అందినంత దండుకుంటున్నాయి. ఈ పరిస్థితికి అడ్డుకట్ట వేయాల్సిన జిల్లా విద్యాశాఖ ఈవైపుగా చూడటం లేదనే ఆరోపణలు లేకపోలేవు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పడం వరకే తప్ప క్షేత్రస్థాయిలో పాఠశాలల్లో జరుగుతున్న వ్యవహారంపై పర్యవేక్షణ చేయడం లేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

**ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు అంతంతే..**

జిల్లాలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో ప్రభుత్వ పాఠ్యపుస్తకాల అమలు అంతంత మాత్రమే అన్నట్లు నిలుస్తోంది. ముఖ్యంగా ప్రాథమిక తరగతుల్లో వారికి తోచిన పబ్లిషర్ పుస్తకాలను వాడటం రివాజుగా మారింది. ఉన్నత తరగతుల విద్యార్థులకు ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు తప్పనిసరి కావడంతో యాజమాన్యాలు వాటిని వాడుతున్నాయి. ఐఐటీ, నీట్ అంటూ ప్రత్యేకంగా బోధన చేస్తున్న పాఠశాలల్లో ప్రభుత్వ పాఠ్యపుస్తకాలకు బదులు యాజమాన్యాలు ఎంచుకున్న ప్రైవేటు పుస్తకాలతోనే బోధన చేస్తున్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను వాడుతున్నా వాటి బోధన మొక్కుబడిగానే సాగుతోంది.

**చర్యలు తప్పవు** జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో విద్యా సామగ్రి అమ్ముతున్నారనే విషయం మా దృష్టికి వచ్చింది. పుస్తకాలు, దుస్తులు, ఇతర వస్తువుల అమ్మకానికి పాల్పడితే చర్యలు తప్పవు. యాజమాన్యాలు ఒకే దుకాణంలో కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేసుకుంటే ఆధారాలతో తమను సంప్రదిస్తే చర్యలకు వెనకాడం. తల్లిదండ్రులు కూడా ఈ విషయంలో చైతన్యవంతులు కావాల్సిన అవసరముంది.

జనార్దన్‌రావు, డీఈవో, కరీంనగర్

# లోటు.. పంటలకు చేటు!

వికారాబాద్: జిల్లాలో మేఘాలు ఊరిస్తున్నాయి. భారీ వర్షం కురుస్తుందనే రీతిలో నల్లని మేఘాలు కమ్ముకుంటున్నా, అంతలోనే తేలిపోయి చినుకు జాడ దూరమవుతోంది. నెల రోజులుగా ప్రజలు ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు. గత వారం రోజుల నుంచి అడపాదడపా వానలు కురవడంతో పంటలకు మేలు జరిగింది. గతేడాది ఈపాటికే పంటలకు సరిపడా వానలు పడడంతో పంటలు కళకళలాడుతూ కనిపించాయి. గతేడాది కన్నా ఈసారి తక్కువ వర్షపాతం నమోదైంది. గతేడాది ఈ సమయానికి జిల్లాలోని అన్ని మండలాల్లో సాధారణానికి మించి వర్షాలు పడగా, ఈసారి సగం మండలాల్లో కూడా సాధారణం కంటే తక్కువగానే కురిసింది. జిల్లాలో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో 5.84 లక్షల ఎకరాల్లో పంటల సాగు లక్ష్యం కాగా, వర్షాభావంతో 4.76 లక్షల ఎకరాల్లోనే పంటలు వేశారు.

**విత్తనాలు మొలకెత్తక దున్నేశారు..:** వర్షాలు కురుస్తాయన్న నమ్మకంతో చాలా మంది రైతులు ముందస్తుగా విత్తనాలు వేసి వర్షాలకు వేచి చూసినా ఫలితం లేకపోయింది. మొలక దశలోనే మగ్గిపోయిన విత్తనాలను చాలా మంది దున్నేశారు. పెట్టుబడి భారం రెట్టింపైంది. వానాకాలం సీజన్ అదును దాటుతుండటం, ఒకవేళ విత్తనాలు వేసినా పంటల దిగుబడులపై ప్రభావం చూపనుండటంతో యాసంగి పంటలను సాగు చేయాలన్న యోచనలో రైతులు ఉన్నారు. జిల్లాలో జులైలో సగటు వర్షపాతం 181.4 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా, 146.6 మాత్రమే నమోదైంది. జూన్‌లో 176.5 కురవాల్సి ఉండగా, 126.3 మాత్రమే కురిసింది. లోటు వర్షపాతం నమోదు కావడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు.

# ఆరోగ్యశ్రీపై అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు



హైదరాబాద్: ఆరోగ్యశ్రీపై అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డుకు లింకు పెట్టొద్దని స్పష్టం చేశారు. అందరికీ ఆరోగ్యశ్రీ కార్డులు అందించేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు పారితోషికం పెంచాలని, గిరిజన ప్రాంతాల్లో సరైన వైద్య సదుపాయాలు అందేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అలాగే ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.




ప్రొటోకాల్ ఉల్లంఘనలు, పార్టీ ఫిరాయింపులపై శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌కు భారాస ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల సభ్యత్వాలను రద్దు చేయాలని.. పది మంది భారాస, ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారని సభాపతి దృష్టికి తెచ్చామని కేటీఆర్ అన్నారు. ఫిరాయింపులపై వచ్చిన ఫిర్యాదులపై మూడు నెలల్లోగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదివరకు ఫిర్యాదులు ఇచ్చి నాలుగు నెలలు గడిచినా చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు.

**పార్టీ మారండి.. లేదంటే ప్రాణగండం ఉందని ఎమ్మెల్యేలకు డీఎస్పీలు బెదిరింపులు : కేటీఆర్ –** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్న సంగతి తెలిసిందే. ఈ పార్టీ ఫిరాయింపులకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు.

ఈ విషయంపై అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద జర్నలిస్టులు అడిగిన ప్రశ్నకు కేటీఆర్ బదులిచ్చారు. రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో దుర్మార్గమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఒక ఇద్దరు ఎమ్మెల్యేలకు వారి నియోజకవర్గాల్లో ఉన్న డీఎస్పీలు ఫోన్ చేసి పార్టీ మారండి.. లేదంటే ప్రాణగండం ఉందని బెదిరించారు. ఇంకా కొందరిని బెదిరింపులకు గురి చేస్తున్నారు. బీజేపీని వాషింగ్ మిషన్ పార్టీగా విమర్శించిన కాంగ్రెస్ అదే పనిని తెలంగాణలో చేస్తోంది. వేరే రాష్ట్రాల్లో బీజేపీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తీసుకుంటే మర్డర్ ఆఫ్ డెమోక్రసీ అంటున్నారు. కానీ మీరు చేస్తున్నది ఏంటని అడిగితే సమాధానం లేదు. కానీ సేమ్ అదే పని తెలంగాణలలో చేస్తున్నారు. ఎమ్మెల్యేలు పార్టీ మారకపోతే వారి సొంత ఆస్తులను ధ్వసం చేస్తున్నారు. విజిలెన్స్ దాడులతో బెదిరిస్తున్నారు. భయభ్రాంతులకు గురి చేస్తున్నారు అని కేటీఆర్ తెలిపారు. బడే భాయ్ – చోటే భాయ్‌కి తేడా ఏం లేదు. ఢిల్లీలో బడే భాయ్ నరేంద్ర మోడీ రాజ్యాంగబద్ధ సంస్థలను ఉపయోగించుకున్నట్లుగానే ఇక్కడ చోటే భాయ్ రేవంత్ రెడ్డి ప్రభుత్వ విభాగాలను ఉపయోగించుకుని మా ఎమ్మెల్యేలను బెదిరింపులకు గురి చేస్తున్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల మీద మాకు సానుభూతి ఉంది. ఎందుకంటే వారికి వారే ఆత్మహత్య చేసుకున్నారు. వారిని ఎవరూ కాపాడలేరు. ప్రజలు తప్పకుండా శిక్షిస్తారు. రాజకీయాల్లో హత్యలు ఉండవు.. ఆత్మహత్యలే ఉంటాయనడానికి ఇదే ఉదాహరణ అని కేటీఆర్ పేర్కొన్నారు.

# రైతు రుణమాఫీకి రేషన్ కార్డుల షరతులు ఎందుకు..?



హైదరాబాద్: రైతు రుణమాఫీ మార్గదర్శకాలు చూస్తే వడపోతల, రైతుల సంఖ్య కోత మీద దృష్టి పెట్టినట్లు కనిపిస్తోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. రుణమాఫీకి రేషన్ కార్డుల షరతులు ఎందుకని ప్రశ్నించారు. చేతల పాలన పోయి.. షరతుల పాలన వచ్చిందని విమర్శించారు. బ్యాంక్‌లు రేషన్ కార్డులు చూసి రుణం ఇచ్చారా? అని నిలదీశారు. రైతును రైతుగా చూడాలని సూచించారు. రైతు రుణమాఫీకి ఇన్ని షరతులు ఎందుకని ప్రశ్నించారు. రేషన్ కార్డులో విడిపోయినంత మాత్రాన రుణమాఫీకి అర్హులు కారా అని నిలదీశారు. ఇది రైతులను మోసం చేయడమేనని విమర్శించారు.

ఏడు నెలలుగా కొత్త రేషన్ కార్డులు ఎందుకు ఇవ్వట్లేదని అడిగారు. కుటుంబం, రేషన్ కార్డు అనే షరతులు ఎత్తేయాలని అన్నారు. పీఎం కిసాన్ నిబంధన తీసుకోవడం అంటే 39లక్షల మంది రైతుల రుణమాఫీ ఎగ్గొట్టడమేనని చెప్పారు. రూ. 2లక్షల రూపాయలు నేరుగా రైతుల ఖాతాలో జమ చేయాలని అన్నారు. రైతు రుణమాఫీని ఆలస్యం చేసే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. స్వల్ప కాలిక రుణాలకే వర్తిస్తుందని అంటూ పండ్ల తోటలు పెట్టిన రైతులకు ఎగ్గొడుతున్నారని మండిపడ్డారు. రీ షెడ్యూల్ రైతులకు వర్తించదంటే రైతులు నష్టపోతారని చెప్పారు. షరతులు ఉపసంహరించుకోవాలని లేదంటే రైతుల పక్షాన పోరాడుతామని తెలిపారు. అసెంబ్లీలో రైతు రుణమాఫీపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని హరీశ్‌రావు పేర్కొన్నారు.





## సోమవారంలోపు కమిషన్‌కు కొత్త ఛైర్మన్‌ను నియమిస్తాం: తెలంగాణ ప్రభుత్వం

దిల్లీ: తెలంగాణలో విద్యుత్ ఒప్పందాలపై ఏర్పాటు చేసిన విచారణ కమిషన్‌కు కొత్త ఛైర్మన్‌ను సోమవారం లోపు నియమిస్తామని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ అంశంలో భారాస అధినేత కేసీఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కమిషన్ పంపిన సమన్లపై హైకోర్టు ఈ నెల 1న ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. కమిషన్ ఛైర్మన్ జస్టిస్ నర్సింహారెడ్డి ప్రెస్‌మీట్ నిర్వహించడంపై సుప్రీంకోర్టు అభ్యంతరం తెలిపింది. కమిషన్ ఛైర్మన్‌ను మార్చాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఛైర్మన్‌ను మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. భోజన విరామం తర్వాత తదుపరి విచారణ కొనసాగిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. అయితే భోజన విరామ సమయంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. విద్యుత్ ఒప్పందాలపై విచారణ నుంచి తప్పుకొంటున్నట్లు న్యాయవాది ద్వారా జస్టిస్ నర్సింహారెడ్డి సుప్రీంకోర్టుకు లేఖ పంపారు. దీంతో ఆయనస్థానంలో మరొకరి నియామకానికి అత్యున్నత న్యాయస్థానం సమయమిచ్చింది. ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారమే కొత్త జడ్జి నేతృత్వంలో కమిషన్ విచారణ కొనసాగించవచ్చని పేర్కొంది. సోమవారంలోపు నూతన ఛైర్మన్‌ను నియమిస్తామని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. దీంతో కేసీఆర్ పిటిషన్‌పై విచారణ ముగిస్తున్నట్టు సీజేఐ ధర్మాసనం వెల్లడించింది. ఇరుపక్షాల తరఫున సీనియర్ న్యాయవాదులు సుదీర్ఘంగా వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అభిషేక్ మనుసింఘ్వీ, సిద్ధార్థ్ లూథ్రా.. కేసీఆర్ తరఫున ముకుల్ రోహత్గీ వాదించారు.

**జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి ప్రెస్‌మీట్‌లో ఏం చెప్పారంటే? :** ఇటీవల బీఆర్‌కే భవన్‌లో ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ఎస్ఏఎం రిజ్వీ, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు, ఇతర అధికారులతో కమిషన్ ఛైర్మన్ రెండు గంటల పాటు సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్, ఛత్తీస్‌గఢ్‌తో రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు ఒప్పందం చేసుకున్న సమయంలో నిర్ణయాలు తీసుకున్న కొంతమంది అధికారుల అభిప్రాయాలు తెలుసుకోవాల్సి ఉంది. ఆ సమయంలో ఉన్న అధికారులు, ప్రజాప్రతినిధులు అందరికీ లేఖలు రాస్తాం. ఈ విషయంలో ప్రజా అభిప్రాయ సేకరణ ఉంటుంది. సమాచారం అవస రం అనుకున్న వారికి నోటీసులు కూడా అందజేస్తాం. రాజకీయాలకు అతీతంగా విచారణ చేపడతాం, వంద రోజుల్లో నివేదిక సమర్పిస్తాం" అని కమిషన్ ఛైర్మన్ జస్టిస్ నర్సింహారెడ్డి తెలిపారు. ఆ తర్వాత భారాస అధినేత కేసీఆర్‌కు నోటీసులు జారీ చేశారు. "విద్యుత్ కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించింది. జస్టిస్ నరసింహారెడ్డి ఏకపక్షంగా ప్రెస్‌మీట్ పెట్టి వివరాలను వెల్లడించారు. ఇది సుప్రీం కోర్టు తీర్పులకు విరుద్ధం. విద్యుత్ కొనుగోలు, పవర్ ప్లాంట్ల నిర్మాణాలపై వివరణ ఇవ్వాలని కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారు. నోటీసులకు సమాధానం ఇవ్వకముందే జస్టిస్ నర్సింహారెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు" అని కేసీఆర్ తరఫు న్యాయవాదుల వాదన.

# విద్యుత్ ఒప్పందాలపై విచారణ నుంచి తప్పుకున్న జస్టిస్ నరసింహా రెడ్డి



హైదరాబాద్ : బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దెబ్బకు జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి తప్పుకున్నారు. తెలంగాణలో విద్యుత్ ఒప్పందాలపై ఏర్పాటు చేసిన కమిషన్ నుంచి తప్పుకుంటున్నట్టు సుప్రీంకోర్టుకు జస్టిస్ నరసింహా రెడ్డి లేఖ పంపారు. దీంతో ఆయన స్థానంలో మరొకరి నియామకానికి అత్యున్నత న్యాయస్థానం సమయం ఇచ్చింది. ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారమే కొత్త జడ్జి నేతృత్వంలో కమిషన్ విచారణ కొనసాగించొచ్చని పేర్కొంది. సోమవారం లోపు కొత్త ఛైర్మన్‌ను నియమిస్తామని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు తెలిపింది. దీంతో కేసీఆర్ పిటిషన్‌పై విచారణ ముగిస్తున్నట్లు సీజేఐ ప్రకటించింది.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్ ఒప్పందాలపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ నర్సింహారెడ్డితో జ్యుడిషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఆ కమిషన్ విచారణను సవాల్ చేస్తూ కేసీఆర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు మంగళవారం ఉదయం విచారణ చేపట్టింది. ఇరుపక్షాల తరఫున సీనియర్ న్యాయవాదులు సుదీర్ఘంగా వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అభిషేక్ మనుసింఘ్వీ, సిద్ధార్థ్ లూథ్రా, కేసీఆర్ తరఫున ముకుల్ రోహత్గీ వాదించారు. ఈ వాదనల అనంతరం విద్యుత్ ఒప్పందాలపై ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ ఛైర్మన్‌ను మార్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. కమిషన్ ఛైర్మన్ జస్టిస్ నర్సింహారెడ్డి ప్రెస్‌మీట్ నిర్వహించడంపై కోర్టు తీవ్ర అభ్యంతరం తెలిపింది. కమిషన్‌ను మార్చాలని కోర్టు ఆదేశించింది.

మధ్యాహ్నం 2 గంటల లోపు నూతన ఛైర్మన్ పేరును వెల్లడిస్తామని పేర్కొంది. భోజన విరామం అనంతరం తదుపరి విచారణ కొనసాగిస్తామని కోర్టు తెలిపింది. అయితే భోజన విరామ సమయంలో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. విద్యుత్ ఒప్పందాలపై విచారణ నుంచి తప్పుకుంటున్నట్టు ఓ న్యాయవాది ద్వారా జస్టిస్ నర్సింహారెడ్డి సుప్రీంకోర్టుకు లేఖ పంపారు.



# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు, ప్రోటోకాల్ ఉల్లంఘనలపై స్పీకర్‌కు ఫిర్యాదు

హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీలో చేరిన పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని, పలు నియోజకవర్గాల్లో ప్రోటోకాల్ ఉల్లంఘనలపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పిటిషన్లు సమర్పించారు. బీఆర్ఎస్ బీ ఫాంపై గెలుపొంది పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను కోరారు. అదే విధంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలిచిన నియోజకవర్గాల్లో అధికారులు ప్రోటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్లు స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓడిపోయిన వారికి ప్రాధాన్యత ఇస్తూ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. వీటిన్నింటిపై దృష్టి సారించి, పరిష్కరించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోరారు. స్పీకర్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, పద్మారావు గౌడ్, వేముల ప్రశాంత్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, రాజశేఖర్ రెడ్డి, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, మాగంటి గోపీనాథ్, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, కేపీ వివేకానంద గౌడ్ ఉన్నారు.

# బీఆర్ఎస్ పాఠాలు నేర్పాలని చూస్తోంది: కాంగ్రెస్ నేత కోదండరెడ్డి

హైదరాబాద్: రుణమాఫీ విషయంలో బీఆర్ఎస్ పార్టీ రైతులను గందరగోళానికి గురి చేస్తోందంటూ కాంగ్రెస్ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి మండిపడ్డారు. రుణమాఫీపై కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన ఆలోచనలు ఉన్నాయని ఆయన చెప్పారు. దీనికి సంబంధించిన విధివిధానాలు సోమవారం విడుదల చేసినట్లు కోదండరెడ్డి చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ నేతలు రుణమాఫీ అంశంలో రైతులను పరేషాన్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గులాబీ నేతలు మాకు పాఠాలు నేర్పుతున్నారని, దేశంలో మొదటిసారి రుణమాఫీ చేసింది కాంగ్రెస్ సర్కారే అని ఆయన గుర్తు చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఆ పథకాన్ని తీసుకొచ్చారు. పథకానికి సంబంధించిన ప్రతిపాదనలు అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఎదుట ఆయన పెట్టారు. దాన్నే అప్పటి యూపీఏ సర్కార్ దేశవ్యాప్తంగా అమలు చేసిందని కోదండరెడ్డి గుర్తు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ఎన్నిసార్లు రుణమాఫీ చేసిందో చెప్పాలని, వారికి బకాయిలు చెల్లించడమే సరిపోయిందని ఆయన ఎద్దేవా చేశారు. తాము పకడ్బందీ విధానాలతో ఒకేసారి రూ.2లక్షలు మాఫీ చేస్తూ రైతులను ఆదుకుంటున్నట్లు చెప్పారు. అర్హులకు లబ్ధి అందలేదంటూ బీఆర్ఎస్ వాళ్లు గోల్‌మాల్ చేస్తూ మమ్మల్ని తప్పుపడుతున్నారు. గత పదేళ్లల్లో ఎంతమందికి రుణమాఫీ చేశారో గులాబీ నేతలు సమాధానం చెప్పాలని ఆయన ప్రశ్నించారు.

ఆర్బీఐ కూడా వ్యవసాయానికి పెద్దపీట వెయ్యాలని చెబుతోందని కోదండరెడ్డి చెప్పుకొచ్చారు. రేషన్ కార్డు ఉంటేనే రుణమాఫీ అని పెట్టాం. కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకొని దాన్ని అమలు చేస్తామని వెల్లడించారు. లబ్ధిపై రైతులకు ఎలాంటి అనుమానాలు ఉన్నా స్థానిక వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించవచ్చని కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి సూచించారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను...
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.
సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660